క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగను పంపిణీ చేస్తున్న స్టేషన్ మేనేజర్, ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: ప్రయాణికుల సౌకర్యార్థం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో శుక్రవారం ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. మే నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా రైల్వే ఆటో యూనియన్ స్టాండ్ వద్ద మజ్జిగ చలివేంద్రం నెలకొల్పారు. రైల్వే, బస్సు కాంప్లెక్స్ కూడలి ప్రదేశంలో దీనిని ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు సౌకర్యంగా ఉంది. ఈ మజ్జిగ చలివేంద్రాన్ని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ప్రారంభించారు. ట్రాఫిక్ పోలీసులు, ఆటో యూనియన్ ప్రతినిధులు సేవలందించారు.

యోగాతో ఆరోగ్యకర సమాజం

బోట్‌క్లబ్: ప్రాచీన కాలం నుంచి భారతీయ సంప్రదాయంగా వస్తున్న యోగా ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించవచ్చునని ఆది గురు యోగా పీఠం స్వామి ఆదిగురు సచ్చిదానంద యోగి అన్నారు. ఆదిగురు యోగా ట్రస్టు పీఠం నూతన కార్యవర్గ సమావేశం శుక్రవారం పీఠం కార్యాలయంలో జరిగింది. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనవిధానం అవలంబించేందుకు యోగా ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. యోగా పట్ల అవగాహన పెంచేందుకు యోగా పీఠాన్ని స్థాపించి కార్యవర్గం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నూతన కార్యవర్గం

వ్యవస్థాపక అధ్యక్షుడు ఆదిగురు సచ్చిదానంద యోగి, ఉపాధ్యక్షుడు ఎం.లక్ష్మీనారాయణ రావు, ప్రధాన కార్యదర్శి మంజీర, సహ కార్యదర్శిగా అపరాజిత, కోశాధికారిగా వీవీ నరసింహ మూర్తి, కార్యవర్గ సభ్యులుగా ఇందిర, లక్ష్మీకాంత్, ఎం.వీరబాబు, రాంబాబు, సీహెచ్ సంగమేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, కె.భాస్కర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులను స్వామీజీ సత్కరించి జ్ఞాపికలు అందించారు.

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078

సామర్లకోట అధికారులు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ–1	85558 71069
ఎంఈఓ–2	94410 73418
ట్రాన్స్‌కో ఏడీఈ	94408 12600
ట్రాన్స్‌కో ఏఈ	94408 12634
ట్రాన్స్‌కో ఏఈ రూరల్	94408 12686

కరతాళ ధ్వనుల కోలాటం

- సేవే పరమావధిగా దుర్గాడ భక్త బృందం
- సాధారణ పిల్లల అసాధారణ ప్రతిభ
- అత్యధిక సభ్యులతో భజన సమాజం



శ్రీఉమరామలింగేశ్వర కోలాట భజన మండలి కళాకారుల ప్రదర్శనలు





పిఠాపురం: వారంతా విద్యార్థులు. చదువు, ఆటపాటలు మినహా మరేతర వ్యాపకాలు లేని చిన్నారులు. కేవలం చదువుకు మాత్రమే పరిమితమైన పిల్లలు.. ఇప్పుడు సంస్కృతికీ ప్రాధాన్యమిస్తున్నారు. ఖాళీ సమయాల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇతర పిల్లలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పిఠాపురం, పరిసర ప్రాంతాలతో పాటు, వివిధ ప్రాంతాల్లోను ఏవిధమైన ఉత్సవాలు, ఆలయాల వార్షికోత్సవాలు, దేవుడి కల్యాణాలు జరుగుతున్నాయంటే, అక్కడ ఒకేరంగు దుస్తులు ధరించి కరతాళ ధ్వనులతో, భక్తిపాటలతో అలరించే పలువురు బాలబాలికలు కనిపిస్తుంటారు. వారే గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన శ్రీఉమరామలింగేశ్వర కోలాట భజన మండలి. పదేళ్ల బాలిక నుంచి 20 ఏళ్ల వరకున్న బాలికలు ఈ బృందంలో సభ్యులుగా చేరి, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కోలాట, భజన కార్యక్రమాల్లోను పాల్గొంటూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు.

60 మందితో ఆరంభమై..

దుర్గాడ పేరు చెబితే ఆధ్యాత్మికతను పెట్టింది పేరు. ఇక్కడ వెలసిన రామలింగేశ్వరస్వామి వారి ఆలయం ఎంతో చరిత్ర ఉన్నది కావడంతో.. ఇక్కడకు దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. ఆలయంలో ఏటా జరిగే ఉత్సవాల్లో ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాల్లో కోలాటం ఆ గ్రామ పిల్లల్లో ఉత్సాహం నింపింది. వారి ఉత్సాహం చూసిన నిమ్మగడ్డ వెంకట శివరామకృష్ణ 2017లో 60 మందితో ఓ బృందం ఏర్పాటు చేసి, కోలాటంలో శిక్షణ ఇచ్చారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు దత్తు, ఆదిత్య సహకారంతో 60 మందితో ప్రారంభమైన ఈ బృందం ఇప్పుడు 300 మందితో కొనసాగుతోంది. ఇప్పటి వరకు 200కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టులో అతి పెద్ద భజన సమాజంగా గుర్తింపు పొందింది. క్రియ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

కోలాటమంటే ముందుంటారు



దుర్గాడతో పాటు, ఎక్కడ ఏ ఆలయాల్లో ఉత్సవాలు జరిగినా మా సంఘ సభ్యులు ముందుంటారు. వీరంతా చిన్నవారే అయినప్పటికీ భక్తితో కోలాటం నేర్చుకున్నారు. కోలాట కళాకారులు భజన బృందం తిరుమల తిరుపతి దేవస్థానాల్లో జరిగే ఉత్సవాలకు వెళ్లి అక్కడ కోలాటం, భజనలు చేస్తుంటాం.

– నిమ్మగడ్డ వెంకట శివరామకృష్ణ, రూపకర్త, శ్రీఉమరామలింగేశ్వర కోలాట భజన మండలి

ఆ ఆనందమే వేరు



భక్తితో దేవుడికి చేస్తున్న సేవ ద్వారా వచ్చే ఆనందమే వేరు. తొక్కుడు బిళ్ల ఆడుకునే మీరు ఏం చేస్తారనే వారు. ఇప్పుడు మేము చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు చూసి అందరూ మెచ్చుకుంటున్నారు. కోలాటం చేసేటప్పుడు ఎప్పుడు కష్టం అనిపించలేదు. ఎంత చేసినా ఇంకా చేయాలనిపిస్తుంది.

– వెత్సా లలిత, సభ్యురాలు, కోలాట బృందం

దేవుడిచ్చిన వరం



భగవంతుడి ముందు ఆటపాటలతో మా భక్తిని ప్రదర్శించడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాం. గుడికి వెళ్లడం వేరు, సేవకులుగా గుడికి వెళ్లడం వేరని మా నాట్యం, కళ ప్రారంభించాక తెలిసింది. దణ్ణం పెట్టుకుని, మొక్కుబడులు ఇచ్చేసి వచ్చేస్తే మన వరకే తృప్తి మిగులుతుంది. సేవ చేస్తే పది మందికీ తృప్తితో పాటు, మనకు ఎనలేని సంతృప్తి కలుగుతోంది.

– చెరుకూరి ఆదిత్య, అధ్యక్షులు, శ్రీఉమరామలింగేశ్వర కోలాట భజన మండలి

ఆనందంగా ఉంది



చదువుతో పాటు, దైవ సన్నిధిలో సేవ చేయడం ఆనందంగా ఉంది ఆలయ ఉత్సవాల్లో మేము భాగస్వాములు కావడం సంతృప్తికరంగా ఉంటుంది. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాం. చాలా మంది మా బృందంలో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారు.

– నాగళ్ల తేజ, సభ్యురాలు, కోలాట భక్త బృందం

ఘనంగా శంకరాచార్యుల జయంతి



పంచారామ క్షేత్రంలో ఆదిశంకరాచార్యులుకు నిర్వహిస్తున్న పూజలు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శంకరాచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనాలతో ప్రజలను భక్తి మార్గంలో నడిపించిన విధానాన్ని శ్రీచక్ర పండితులు వేమూరి సోమేశ్వరశర్మ వివరించారు. హిందూ ధర్మరక్షణ కోసం సన్యాస దీక్ష చేపట్టి, విశ్వాసానికి ఆది గురువుగా ప్రసిద్ధి చెందిన ఘనత ఆదిశంకరాచార్యులుకే దక్కిందన్నారు. ఆయన చిత్రపటానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితు లు సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, చెరుకూరి రాంబాబు, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏపీయూడబ్ల్యూజే మహాసభ

పెద్దాపురం: కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల 4న ఏపీయూడబ్ల్యూజే మహాసభ నిర్వహిస్తున్నట్టు ఐజేయూ సభ్యులు రాకుర్తి రాంబాబు, సీనియర్ జర్నలిస్ట్ అడపా వెంకట్రావు తెలిపారు. స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయ కాలక్షేప మండపంలో శుక్రవారం యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు పెమ్మాడి వీరభద్రవర్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

జగనన్న కాలనీ పేరు పునరుద్ధరించరా..?



పేరుపై రంగులు వేసి ఉన్న జగనన్న కాలనీ ముఖద్వారం

- ఎన్నికల కోడ్ పూర్తయినా పట్టించుకోని అధికారులు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్ జగనన్న కాలనీ ముఖ ద్వారంపై ఉన్న బోర్డుకు రంగులు వేశారు. సార్వత్రిక ఎన్నికలతో పాటు, ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయినా బోర్డును ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఫిబ్రవరిలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్‌తో పాటు, పలువురు కౌన్సిలర్లు జగనన్న కాలనీ ముఖద్వారానికి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు బోర్డు ఏర్పాటుపై ఎటువంటి చర్యలు లేవు. సామర్లకోట–కిర్లంపూడి రోడ్డులోని ఈటీసీ లేఅవుట్‌లో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో 2,200 ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా, సుమారు 1,500 ఇళ్లు పూర్తయ్యాయి. వారం రోజుల్లో బోర్డును ఏర్పాటు చేయకపోతే మున్సిపల్ అధికారుల తీరుపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, జట్ల మోహన్, పాలిక కుసుమ తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఈ కాలనీ ముఖద్వారంపై వెంటనే పేరు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

కార్మికుల హక్కుల రక్షణకే సార్వత్రిక సమ్మె



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

పెద్దాపురం: దేశవ్యాప్తంగా ఉన్న కార్మికుల హక్కుల రక్షణ కోసమే ఈ నెల 20న సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి అన్నారు. మేడే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక మెయిన్‌రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. నాయకుడు చింతల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిందని, 11 నెలలు పూర్తయినా అమలుకు నోచుకోలేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అలాగే ఉండిపోయిందని, అంగన్‌వాడీ, ఆశా, మిడ్డే మీల్స్, మున్సిపల్ వర్కర్స్ వేతనాల పెంపు ఊసే లేదన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. నాయకులు గడిగట్ల సత్తిబాబు, గూనురి రమణ, తైనాల శ్రీను, ఏస్తేరు రాణి, దాడి బేబీలు ప్రసంగించారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ఈ నెల 20న తలపెట్టిన కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు పిలుపునిచ్చారు. ఆనూరులోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో మేడే వారోత్సవాల్లో భాగంగా దళితపేటలో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా దళితపేటలో మౌలిక వసతుల కల్పనకు పోరాటం చేస్తున్నామన్నారు. ఫలితంగా భూమిని సాధించుకుని ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. కాలనీలో వీధిలైట్లు, రోడ్లు, డ్రైన్లు లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తొలుత మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొచ్చ ఏసు, రెడ్డి దుర్గాదేవి, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బేబీరాణి

వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షులు వీరే..



దవులూరి దొరబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉగ్గిన గోపి

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలో యువజన విభాగం మండల అధ్యక్షులను ప్రకటించారు. ఈ మేరకు పెద్దాపురం మున్సిపాలిటీ నుంచి కురందాసు సతీష్‌కుమార్, మండలం నుంచి గుమ్మర్తి ఆనందరావు, సామర్లకోట మున్సిపాలిటీ నుంచి పెదిరెడ్ల కృష్ణ, సామర్లకోట మండలం నుంచి ఉగ్గిన గోపి నియమితులయ్యారు. నూతనంగా నియమితులైన మండల యువజన విభాగం అధ్యక్షులను పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అభినందించారు.

దొరబాబును కలిసిన ఉగ్గిన

వైఎస్సార్ సీపీ సామర్లకోట మండల యూత్ అధ్యక్షునిగా నియమితులైన ఉగ్గిన గోపి శుక్రవారం రాత్రి పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబును కలిశారు. యువజన విభాగం అధ్యక్షునిగా నియమించడంలో కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాగా సురేష్ కుమార్, కౌన్సిలర్లు రెడ్నం సునీత, సేపెని సురేష్, పాలిక కుసుమ, పెండ్యాల వెంకటలక్ష్మీ, నేతల హరిబాబు, చిట్టుమాని రాఘవ, కానేటి రాజేశ్వరి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప తదితరులు ఉన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: పట్టణంలోని మతం సెంటర్‌లో ఎట్టకేలకు కల్వర్టు పనులు ప్రారంభించారు. మున్సిపాలిటీలోని డ్రైన్లలో పూడికతీత పనుల్లో భాగంగా స్థానిక మతం సెంటర్‌లోని కల్వర్టులను కూల్చివేసి, పూడిక తొలగించారు. ఆ కల్వర్టులు ప్రమాదభరితంగా మారాయి. దాంతో ‘సాక్షి’లో పలు వార్తలు వెలువడడంతో పాటు, గత నెల 26న ‘భయం భయంగా’ శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. యుద్ధప్రాతిపదికన కల్వర్టు నిర్మించేలా కాంట్రాక్టర్‌ను ఒప్పించారు. దాంతో శుక్రవారం మతం సెంటర్‌లోని రెండు కల్వర్టు పనులు మొదలయ్యాయి. ఈ పనులను కమిషనర్ శ్రీవిద్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, కౌన్సిలర్ బలుసు వాసు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి శుక్రవారం పరిశీలించారు. నాలుగు నెలల క్రితం పూడిక తీత సమయంలో కాంట్రాక్టర్.. మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకు రాకుండా కల్వర్టును కూల్చివేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరితో కల్వర్టును కూల్చివేయడం వల్ల అతడే పనులు పూర్తి చేయాలని వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్‌తో పాటు, మెజార్టీ కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కల్వర్టు పనులకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ తదితరులు

చెరువు నీటి తొలగింపులో ఆంతర్యమేమిటో?



చెరువులో నీటిని తొలగిస్తున్న మోటారు

- మట్టి తరలింపునకే అని అనుమానాలు

సామర్లకోట: పట్టణంలోని కిర్లంపూడి రోడ్డులో ఐఎంఎఫ్ఎల్ డిపో ఎదురుగా ఉన్న చెరువులో నీటిని పూర్తిగా తొలగిస్తున్నారు. వేసవి కాలంలో చెరువులో నీటిని నింపాల్సి ఉండగా, తొలగించడంపై ఆయా గ్రామాల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు సమీపంలోనే జగనన్న కాలనీ ఏర్పాటు కావడంతో, ఈ చెరువుకు వైఎస్సార్ జగనన్న భూరక్ష అని పేరు పెట్టి రాయి ఏర్పాటు చేశారు. ఈ చెరువులో మత్స్యకారులు చేపల పెంపకం చేసేవారు. చెరువులో మట్టి తవ్వకం చేయడానికి నీరు తొలగించాలని నిర్ణయించారు. ఈ మేరకు మత్స్యకారులు చెరువులో చేపలను పట్టుకునే పనులు ప్రారంభించి, నీటిని తొలగిస్తున్నారు. దీనిపై మత్స్యకార సంఘ కార్యదర్శి గొర్రెల అప్పారావును వివరణ కోరగా, చెరువులో పూర్తిగా నీటిని తొలగించి, చేపల పెంపకానికి బహిరంగ వేలం నిర్వహిస్తారన్నారు. కాగా, చెరువులో నీటిని పూర్తిగా తొలగించాక, మట్టి తవ్వకం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. దీనిపై అధికారులు స్పందించి, చెరువులో నీటిని నింపాలని జగనన్న కాలనీవాసులు కోరుతున్నారు. చెరువులో నీటిని తొలగిస్తుండడంతో సామర్లకోట–కిర్లంపూడి రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఐసీడీఎస్ జిల్లా కౌన్సిలర్ దుర్గారాణి



కొత్తపల్లిలోని గాదులదొడ్డి అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహిస్తున్న వేసవి శిబిరం

పిఠాపురం: కిశోర వికాసంపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ జిల్లా కౌన్సిలర్ బి.దుర్గారాణి అన్నారు. శుక్రవారం పిఠాపురం మండలం చిత్రాడలో మహిళా సమాఖ్యల ప్రతినిధులు, ఏఎస్‌ఎంలు, వీఓఏలకు కిశోర వికాసంపై నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో ఆమె మాట్లాడారు. బాలల హక్కుల చట్టాలు, కౌమార బాలబాలికల సమస్యలు, ఆరోగ్యం, పోషణావసరాలు, పిల్లల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలను వివరించారు. బాల్య వివాహ నిర్మూలన చట్టాలపై పోస్కో చట్టం, కౌమారంలో వచ్చే మార్పులు, సమస్యలను విశదీకరించారు. పిల్లలతో డ్రామాలు, రోల్ ప్లే లాంటివి చేయించడం ద్వారా వారిలో సామర్థ్యాలను పెంపొందించడం, అవగాహన కల్పించడం తదితర అంశాలతో ఉన్న కిట్లను మహిళా సమాఖ్యల ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం దేవకుమారి, పి.వెంకటలక్ష్మి, జి.మాధవి, సీహెచ్ రత్నమాల, వై.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలు ప్రారంభం

కొత్తపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సెక్టార్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వేసవి శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఆమె మాట్లాడుతూ, ఈ శిబిరాలు జూన్ 10 వరకు జరుగుతాయన్నారు. కౌమార బాలకల సమస్యలు, పోషణ అవసరాలు, ఆరోగ్యం, పిల్లల సంరక్షణ, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆత్మ రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు.



చిత్రాడలో జరిగిన శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న దుర్గారాణి